

**సోమశిలలో 8.51 టీఎంసీలు**

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 8.51 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 25 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.76,200 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.6,806 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.7,010 |
| నవర (8 గ్రాములు) | రూ.56,080 |



**తనిఖీలు.. విస్తృతం**

ఎన్నికల నేపథ్యంలో నగదు తరలింపు, మద్యం అక్రమ రవాణా కట్టడికి పోలీసులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో తనిఖీలను ముమ్మరంగా నిర్వహించారు. 8లో

## నేత్రపర్వం.. రాములోరి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



శబరి శ్రీరామక్షేత్రం నుంచి పల్లకిపై ఊరేగింపుగా వెళ్తున్న సీతారాముడు



హాజరైన అశేష భక్తజనం

శ్రీరామనవమి పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకొన్నారు. నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రం ఎదురుగా గల శ్రీరామకోటి స్థూప ప్రాంగణంలో సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. విశేషంగా తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

## న్యూస్‌రీల్

### 108లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని 108 వాహనాల్లో ఈఎంటీ, పైలట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటీ పోస్టులకు జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీ ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. పైలట్ పోస్టులకు పదో తరగతి పాసై, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి 35 ఏళ్ల లోపు వయస్సు, ఇంగ్లిష్ రాయడం, చదవడం వచ్చి ఉండాలన్నారు. జీజీహెచ్ ప్రాంగణంలోని 108 జిల్లా కార్యాలయంలో ఈ నెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



నెల్లూరు(క్రైమ్): అగ్నిప్రమాద నివారణ చర్యలపై కోవూరులోని చౌదరి పెట్రోల్ బంక్ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో సహాయ అగ్నిమాపక అధికారి వేణుగోపాల్‌రావు మాట్లాడారు. ప్రమాదం సంభవిస్తే ఆక్సిజన్ అందకుండా డీసీపీ పౌడర్‌ను వాడాలని, తీవ్రత ఎక్కువైతే ఫోమ్‌ను వినియోగించాలని సూచించారు.

### రూ.1.5 లక్షల సీజ్



స్వాధీనం చేసుకున్న నగదుతో అధికారులు

ఉదయగిరి: మండలంలోని యర్రబల్లిగడ్డ వద్ద ఎలాంటి పత్రాల్లేకుండా తరలిస్తున్న రూ.1.5 లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నారాయణ బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. సీతారామపురం మండలం బాలాయపల్లికి చెందిన ముత్తంశెట్టి కేశవరావు, వెంకటేశ్వర్లు కలిసి ద్విచక్రవాహనంపై శకునాలపల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో యర్రబల్లిగడ్డ వద్ద వారి వాహనాన్ని తనిఖీ చేయగా, రూ.1.5 లక్షలను కనుగొన్నారు. ఎలాంటి పత్రాల్లేకపోవడంతో నగదును సీజ్ చేసి.. ఉదయగిరి పోలీస్‌స్టేషన్లో ఎస్సై ఇంద్రసేనారెడ్డికి అప్పగించారు. తదుపరి ట్రెజరీలో జమచేయనున్నామని తెలిపారు.


### ముగిసిన శ్రీరామకథా తరంగిణి సప్తాహం

నెల్లూరు(బృందావనం): రేబాలవారివీధిలోని పీటీజీ టవర్స్‌లో పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామకథా తరంగిణి సప్తాహం బుధవారంతో ముగిసింది. ఉత్తరకాండంపై విద్వాన్ డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు ఉపన్యసించారు. సభా పోషకుడిగా సత్యనారాయణ, సభాధ్యక్షుడిగా లక్ష్మీనరసింహారావు వ్యవహరించారు. రామచంద్రప్రసాద్, బలరామయ్యనాయుడు, రామకృష్ణప్రసాద్‌రావు, రాజశేఖర్, సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## తమ్ముళ్లు.. అటో.. ఎటో..!

ఎన్నికలకు పట్టుమని నాలుగు వారాల్లేవు. ఈ దశలోనూ సయోధ్య కుదరక కందుకూరులో టీడీపీ దయనీయ స్థితిని ఎదుర్కొంటోంది. మొదట్నుంచి పార్టీ జెండాను మోసిన వారిని విస్మరించి ఇతరులకు టికెట్ ఇవ్వడంపై ఆ పార్టీలో రాజుకున్న అంతర్గత పోరు నేడు మరింత తీవ్రమవుతోంది. నేతల మధ్య విభేదాలు రోజుకో తరహాలో బయటపడుతున్నాయి. అభ్యర్థి ఎంపిక విషయంలో టీడీపీ అధిష్టాన నిర్ణయాన్ని ఇంటూరి రాజేష్ బహిరంగంగా వ్యతిరేకిస్తుండగా.. పార్టీ అభ్యర్థికి మాజీ ఎమ్మెల్యేలు సహకరించే పరిస్థితి కానరావడంలేదు. ఈ తరుణంలో కీలక నేతల మధ్య కుమ్ములాటలతో పార్టీ కేడర్ డీలాపడుతోంది.

- కందుకూరులో ఇదీ టీడీపీ పరిస్థితి
- నేతల మధ్య కుదరని సఖ్యత
- ఎవరికి వారే యమునా తీరే
- కలిసిరాని దివి శివరామ్, పోతుల రామారావు
- ఇంటూరి రాజేష్ వర్గం ప్రత్యేక శిబిరం
- అయోమయంలో పార్టీ అభ్యర్థి నాగేశ్వరరావు




సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కందుకూరులో టీడీపీ నేతలు ఎవరికి వారే యమునా తీరేననే చందంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావును అధిష్టానం ఖరారు చేయడంతో రాజుకున్న నిప్పు తగ్గకపోగా, ఎన్నికలు సమీపించే కొద్దీ మరింత ఎక్కువవుతోంది. ఈ పరిణామాలతో అయోమయ స్థితిలో కేడర్ కొట్టుమిట్టాడుతోంది.

**వారి వైఖరి చర్చనీయాంశం**

కందుకూరు నియోజకవర్గంలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు దివి శివరామ్, పోతుల రామారావు శైలి ఆ పార్టీలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో పార్టీ కార్యకలాపాలకు వీరు దూరంగా ఉండటం అయోమయానికి కారణమవుతోంది. టీడీపీ అభ్యర్థి నాగేశ్వరరావుకు నిన్నా.. మొన్నటి వరకు అన్ని విధాలా అండదండలు అందించిన దివి శివరామ్ ఎన్నికల వేళ ముఖం చాటేస్తున్నారు.

**మారిన వైఖరి**

నియోజకవర్గంతో మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్‌కు ఎంతో అనుబంధం ఉంది. ఈ తరుణంలో ఆయనకు పార్టీ అధిష్టానం ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ వచ్చింది. తనకున్న గుర్తింపుతో మొదట్లో నాగేశ్వరరావుకు పార్టీ ఇన్‌చార్జి పదవిని ఇప్పించారు. తదనంతరం అన్ని కార్యక్రమాల్లో నాగేశ్వరరావుకు శివరామ్ మద్దతిచ్చారు. అయితే నాగేశ్వరరావును అభ్యర్థిగా ప్రకటించాక శివరామ్ వైఖరి పూర్తిగా మారిపోయింది. టీడీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలోనూ వేదికపైకి శివరామ్ వెళ్లకుండా తన అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కారు. కొందరు పార్టీ నేతలు కలగజేసుకొని సర్దిచెప్పేందుకు యత్నించినా, ఆయన ససేమిరా అన్నారు.

**వ్యతిరేక వర్గానికి సహకారం**

మరోవైపు శివరామ్ సోదరులు లింగయ్యనాయుడు, రమేష్ సైతం నాగేశ్వరరావుకు దూరమయ్యారు. నాగేశ్వరరావును వ్యతిరేకిస్తున్న ఇంటూరి రాజేష్‌తో వీరు చేతులు కలుపుతున్నారు. రాజేష్ నిర్వహించే వ్యతిరేక కార్యక్రమాలకు సైతం హాజరవుతున్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం నాగేశ్వరరావు వర్సెస్ దివి అనే తరహాలో రాజకీయాలు సాగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మరోవైపు ఈ ఎన్నికల్లో మీకు సహకరించేది లేదంటూ నాగేశ్వరరావుకు వీరు ముఖానే చెప్పారనే ప్రచారమూ ఉంది. దీంతో అసలు వీరిద్దరి మధ్య ఏమి జరిగిందనే అంశం ప్రశ్నగా మారింది.

**కన్నెత్తి చూడని పోతుల**

2019 ఎన్నికల్లో ఓటమి అనంతరం మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు నియోజకవర్గానికి దూరమయ్యారు. ఇప్పటి వరకు ఆయన కన్నెత్తి చూడలేదు. కందుకూరులో పార్టీ టికెట్‌ను దక్కించుకునేందుకు శతవిధాలా యత్నించి ఆయన భంగపాటుకు గురయ్యారు. దీంతో నాగేశ్వరరావుకు ఆయన సహకరిస్తారాననేది ప్రశ్నార్థకమే.

### తగ్గేదేలే అంటున్న రాజేష్..

వరుస పరిణామాలతో డీలా పడిన ఇంటూరి నాగేశ్వరరావుకు తన కుటుంబానికే చెందిన ఇంటూరి రాజేష్ నుంచి సెగ ఎదురవుతోంది. నాగేశ్వరరావుకు టికెట్ కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన పోటీగా ప్రచార కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించారు. ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ దిశగా తన కార్యక్రమాలను ముమ్మరం చేశారు. నాగేశ్వరరావు వ్యతిరేక వర్గాలను కలుపుకొంటూ.. తన వర్గాన్ని బలోపేతం చేసుకుంటున్నారు. ఓట్లను చీల్చి తద్వారా నాగేశ్వరరావును ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. మరోవైపు కందుకూరులో టీడీపీ అభ్యర్థిని మారుస్తారంటూ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో పార్టీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

## ఎన్నికల కోడా..? మాకు పట్టదండీ..!

- శ్రీరామనవమి పేరుతో ఆత్మకూరులో ఫ్లెక్సీలు
- నిబంధనలు ఉల్లంఘించిన ఆనం రామనారాయణరెడ్డి



ఆనం రామనారాయణరెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆత్మకూరు: ఎన్నికల కోడ్‌ను ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఉల్లంఘించారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా తన చిత్రంతో ఉన్న ఫ్లెక్సీలను ఆత్మకూరు పట్టణంలో ఏర్పాటు చేశారు. వాస్తవానికి కోడ్ అమల్లో ఉన్న సమయంలో ప్రార్థన మందిరాల వద్ద ప్రచారాలు నిర్వహించడం.. పార్టీ అభ్యర్థుల ఫొటోలు, పేర్లతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం నిషిద్ధం. స్థానిక మెయిన్ బజార్ సమీపంలోని రాముడి ఆలయం వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. ఈ విషయమై ఆత్మకూరు ఆర్వో, ఆర్డీఓకు ఫిర్యాదు చేయనున్నామని పలువురు తెలిపారు.

## నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సర్వశ్రేష్ఠ త్రిపాఠి

- ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎన్నికల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, విధులు, నిబంధనలు తదితరాలపై దిశానిర్దేశం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రచార నిమిత్తం జిల్లాకు విచ్చేసే వీవీఐపీలకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభంకానున్న తరుణంలో, ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఆయా కేంద్రాల వద్ద తగిన బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. ఇతర శాఖలు, స్థానిక గ్రామపెద్దల సమన్వయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లోని నిందితులను బైండోవర్ చేయాలని తెలిపారు. చెక్‌పోస్టుల్లో తనిఖీలను ముమ్మరం చేసి మద్యం, నగదు, ప్రలోభాలకు గురి చేసే వాటిని పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### అబ్బురపరుస్తున్న మునగకాయ



మనుబోలు: మనుబోలులోని కోదండరామపురంలో సంపత్‌కుమార్ ఇంటి పెరటిలో మునగకాయ అబ్బురపరుస్తోంది. సాధారణంగా మునగకాయలు ఒకటిన్నర నుంచి గరిష్టంగా రెండున్నర అడుగుల పొడవుంటాయి. అయితే ఇక్కడ కాసిన మునగకాయ నాలుగు నుంచి నాలుగున్నర అడుగుల పొడవు ఉండటంతో పలువురు ఆశ్చర్యపోతున్నారు.

## తొలి ఘట్టానికి వేళాయె..

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఏర్పాట్లు పూర్తి

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు తొలి ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభంకానుంది. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు.. నెల్లూరు లోక్‌సభ స్థానానికి నామినేషన్లను ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు అధికారులు స్వీకరించనున్నారు. ప్రక్రియను సమర్థంగా నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.

**ప్రత్యేక ఖాతా ద్వారానే లావాదేవీలు**

లోక్‌సభ, శాసనసభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్‌కు ముందే బ్యాంకుల్లో ప్రత్యేక ఖాతాను తెరవాలి. దీని ద్వారానే ఎన్నికలు లావాదేవీలను నిర్వహించాలి. ఈసీ నిబంధనల మేరకు నగదును జమ చేసి ధరావతు మొదలుకొని ఎలాంటి ఖర్చులనైనా వీటి ద్వారానే జరపాల్సి ఉంటుంది. రూ.20 వేలు మించితే చెక్కుల రూపంలో అందజేయడంతో పాటు ఖర్చులకు సంబంధించిన బిల్లులను చూపాల్సి ఉంటుంది.

**సమగ్రంగా నింపాలి**

అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాల్లో ఆస్తుల వివరాలు, నేరచరిత్ర, అభియోగాలను విధిగా తెలియజేయాలి. రూ.10 స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్‌ను వేరుగా అందజేయాలి. నామినేషన్ పత్రంలో ఖాళీలను వదలకుండా సమగ్రంగా పూర్తి చేసివ్వాలి. తేడాలుంటే ఆర్వోలు నోటీసులిచ్చే అవకాశం ఉంటుంది. అభ్యర్థులకు పార్టీలు జారీ చేసే బీ – ఫారం, కుల ధ్రువీకరణ పత్రాలను నామినేషన్ చివరి రోజున మూడు గంటల్లోపు అందజేయాలి.

**అభ్యర్థితో పాటు నలుగురికే అనుమతి**

నామినేషన్ దాఖలు సమయంలో ఆర్‌ఓ కార్యాలయంలో అభ్యర్థితో పాటు నలుగురికే అవకాశం ఉంటుంది. నామినేషన్ పత్రాలను ఎన్నికల నిర్వహణ సిబ్బంది ప్రాథమికంగా పరిశీలించిన అనంతరం ఆర్వోకు అందజేసేందుకు పంపుతారు. ఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల నుంచి ర్యాలీలు తదితరాల నిషేధం అమల్లో ఉంటుంది.

| నియోజకవర్గం | నామినేషన్లు వేయాల్సిన కార్యాలయాలు |
|---|---|
| నెల్లూరు లోక్‌సభ | కలెక్టర్ చాంబర్ |
| నెల్లూరు సిటీ | కార్పొరేషన్ |
| నెల్లూరు రూరల్ | ఆర్డీఓ |
| కందుకూరు | సబ్ కలెక్టర్ |
| కావలి | ఆర్డీఓ |
| ఆత్మకూరు | మున్సిపల్ |
| కోవూరు | తహసీల్దార్ |
| సర్వేపల్లి | ఎంపీడీఓ |
| ఉదయగిరి | తహసీల్దార్ |


### పటిష్ట భద్రత ఏర్పాట్లు

నెల్లూరు(క్రైమ్): నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభంకానున్న తరుణంలో కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లను పోలీస్ శాఖ చేపట్టింది. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్‌ను అమల్లోకి తీసుకొచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్ కేంద్రాల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి, లోక్‌సభ నామినేషన్ కేంద్రం వద్ద ఏఎస్పీ ఆధ్వర్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఒక్కో కేంద్రం వద్ద 80 నుంచి 90 మందికిపైగా సిబ్బంది బందోబస్తు విధులను నిర్వర్తించనున్నారు. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థుల ఊరేగింపులను నిలిపేయనున్నారు. ముందస్తు అనుమతులు పొందిన మూడు వాహనాలను నామినేషన్ కేంద్ర గేటు వరకు అనుమతించనున్నారు.

**పర్యవేక్షణాధికారులు వీరే..**

- కలెక్టరేట్లో నిర్వహించనున్న నెల్లూరు లోక్‌సభ నామినేషన్ల ప్రక్రియకు ఏఎస్పీ సౌజన్య
- నెల్లూరు సిటీకి నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి
- నెల్లూరు రూరల్‌కు సీసీఎస్ డీఎస్పీ రామకృష్ణాచారి
- సర్వేపల్లికి నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి
- కోవూరుకు ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసులు
- ఆత్మకూరుకు స్థానిక డీఎస్పీ కోటారెడ్డి
- ఉదయగిరికి దిశ డీఎస్పీ సాయినాథ్
- కావలికి స్థానిక డీఎస్పీ వెంకటరమణ
- కందుకూరుకు స్థానిక డీఎస్పీ శ్రీనివాసులు

### ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



జిల్లాలో ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి. నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి రోజువారీ ఖర్చుల నివేదికలను సంబంధిత సిబ్బందికి తెలియజేసి వారి ఆమోదం పొందాలి. ఎన్నికల సంఘ నిబంధనలను నామినేషన్ సమయంలో తప్పక పాటించాలి. నామినేషన్లను ఈ నెల 25 వరకు స్వీకరిస్తాం.

– హరినారాయణన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

## అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతా

- మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తా
- క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా సింహపురిని మారుస్తా
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన ఖలీల్ అహ్మద్



కరపత్రాలను అందజేసి.. ఓట్లడుగుతూ..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగరాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పదో డివిజన్లో గల ఉస్మాన్‌సాహెబ్‌పేట, ఎన్టీఆర్ లేఅవుట్ తదితర ప్రాంతాల్లో పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌తో కలిసి బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. నగరాభివృద్ధి తమ హయాంలోనే జరిగిందంటూ నారాయణ తన మాటలను కోటలు దాటిస్తున్నారని విమర్శించారు. ఆయన హయాంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని చెప్పారు. తమ ప్రభుత్వ పాలనలో నెల్లూరు స్థిరమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. నగరంలో పార్కులు, క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి.. ప్రజల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**జాబ్‌మేళాల ద్వారా ఉపాధి**

నెల్లూరులో స్థిరనివాసాన్ని ఏర్పరుచుకొని నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. నిరుద్యోగ యువతకు జాబ్ మేళాల ద్వారా ఉపాధి కల్పించడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్లను నిర్వహించనున్నామని తెలిపారు.

**రూ.52 కోట్లతో అభివృద్ధి**

గడిచిన ఐదేళ్లలో పదో డివిజన్లో రూ.52 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని పేర్కొన్నారు. ప్రధాన రోడ్ల నిర్మాణానికి రూ.ఆరు కోట్లు.. 9, 10 డివిజన్లకు సంబంధించి ఎఫ్‌సీఐ కాలనీలో అర్బన్ పీహెచ్‌సీని ఏర్పాటు చేసిన అంశాన్ని ప్రస్తావించారు. రామ్‌నగర్, పల్లాపు కాలువలకు రక్షణ గోడలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రేబాలవారివీధిలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆధునికీకరిస్తామని చెప్పారు. నగరంలోని రైస్‌మిల్లుల్లో హమాలీలుగా పనిచేసే కార్మికులు ఈ డివిజన్లో నివసిస్తున్నారని, ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

**మరోసారి జగనన్నే సీఎం**

జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని ఖలీల్ అహ్మద్ చెప్పారు. ఎమ్మెల్యేగా తనను.. ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. విజయసాయిరెడ్డిని గెలిపిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి నెల్లూరు అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కార్పొరేటర్ కిన్నెర ప్రేమ్‌కుమార్, నేతలు ఆనం జయకుమార్, కిన్నెర ప్రసాద్, ముక్కాల ద్వారకానాథ్, మల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆత్మకూరును అభివృద్ధి చేస్తాం

• మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజమోహన్‌రెడ్డి

**మర్రిపాడు:** 'ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం. సంక్షేమ ప్రభుత్వం కొనసాగేందుకు అందరూ సహకరించాలి' అని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని చిన్న అల్లంపాడు, పెద్ద అల్లంపాడు గ్రామాల్లో బుధవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి పలువురికి ప్యాకేజీలు ఇచ్చి ప్రలోభాలకు గురిచేశారన్నారు. దీని వల్ల వైఎస్సార్‌సీపీకి మేలు చేకూరిందన్నారు. అనేకమంది విక్రమ్‌రెడ్డి వెంట నడిచేందుకు సిద్ధమయ్యారన్నారు. ఏఎస్‌పేటలో జరిగిన కార్యక్రమంలో ఆనం చేసిన వ్యాఖ్యలపై సవాల్ చేస్తున్నామన్నారు. వేమిరెడ్డి ఎంపీ అభ్యర్థిగా వచ్చిన తర్వాతే ఆత్మకూరులో రామనారాయణరెడ్డి తిరుగుతున్నారని చెప్పారు. వెంకటగిరికి వెళ్లిపోయాడని, వేమిరెడ్డి అందజేసిన ప్యాకేజీతో ఆనం ఇక్కడ రాజకీయాలు చేస్తున్నాడన్నారు. ఆయనకు త్వరలోనే సరైన సమాధానం చెబుతామన్నారు. అలాంటి వారిని ప్రజలు నమ్మరని, వైఎస్సార్‌సీపీని ప్రజలంతా మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, దశరథరామిరెడ్డి, గువ్వల వెంగళరెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, మౌలాలి, హజరత్‌రెడ్డి, దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, రేవూరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా తనిఖీలు

**నెల్లూరు(క్రైమ్):** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణా కట్టడికి పోలీసు, సెబ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. మంగళ, బుధవారాల్లో మనుబోలు పోలీసుస్టేషన్ పరిధిలో ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న వివిధ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెంకటాచలసత్రం పరిధిలో 19, ఇందుకూరుపేటలో 10, సైదాపురంలో ఆరు మద్యం బాటిళ్లు, సెబ్ అధికారులు 195 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

### కండలేరులో 7.636 టీఎంసీలు

**రాపూరు:** కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 7.636 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 25 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



ఘటనా స్థలంలో గాయాలతో భార్గవ్



భార్గవ్ (ఫైల్)

**కొడవలూరు:** మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని గౌతమ్‌నగర్‌లో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దగ్గోలు భార్గవ్ (23) మినీ లారీ డ్రైవర్‌గా ఉన్నాడు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి నార్తురాజుపాళేనికి మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. కొంత దూరం వెళ్లి దళితవాడ వద్ద మలుపు తిరుగుతుండగా బైక్ అదుపుతప్పి కాలువలో పడింది. ఈ ప్రమాదంలో భార్గవ్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని కోవూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడు. ఈ మేరకు ఎస్సై కె.వీరప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 144 |
| లేయర్ (లైవ్) | : 98 |
| బ్రాయిలర్ చికెన్ | : 254 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 284 |
| లేయర్ చికెన్ | : 167 |



### పొదలకూరు నిమ్మధరలు (కిలో)



| | |
|---|---|
| పెద్దవి | : రూ.75 |
| సన్నవి | : రూ.60 |
| పండ్లు | : రూ.26 |

# స్థానికుడిని.. మీకేం కావాలో నాకు తెలుసు

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



అల్లూర్తి గ్రామంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**పొదలకూరు:** 'నేను స్థానికుడిని. మండలంలో ప్రతి గ్రామం గురించి తెలుసు. మీకేం కావాలో ఐడియా ఉంది. టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అలియాస్ అల్లీపురంరెడ్డి అవకాశం కోసం వస్తున్నాడు. ఆయన్ను నమ్మొద్దు. ఎన్నికలయ్యాక కనిపించడు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అల్లుర్తి, ఆర్‌వైపాళెం, అంకుపల్లి, వెంకటాపురం, పర్వతాపురం, పులికల్లు, వావింటపర్తి, ఊసపల్లి గ్రామాల్లో బుధవారం మంత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసినట్లు తెలిపారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు రైతులు, పొదుపు మహిళలకు రుణ మాఫీ చేస్తానని నమ్మించి అధికారంలోకి వచ్చాడన్నారు. కానీ వారిని మోసం చేసినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. సచివాలయాలు, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం జరిగిందన్నారు. ప్రతి వీధిలో సిమెంటురోడ్లు, సైడ్ డ్రెయిన్లు నిర్మించామన్నారు. అధికారం చేజిక్కించుకునేందుకు చంద్రబాబు కూటమిని ఏర్పాటు చేసి వస్తున్నాడని, ఆయన్ను నమ్మొద్దని సూచించారు.

**ఓటెందుకు వేయాలి సోమిరెడ్డి..**

ఏం మేలు చేశావని ప్రజలు నీకు ఓటేయాలని సోమిరెడ్డిని మంత్రి ప్రశ్నించారు. ఆయన వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఒక్క గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయలేదన్నారు. ఐదేళ్లు ప్రజలకు అందుబాటులో లేకుండాపోయి ఇప్పుడొచ్చి ఓట్లు అడుగుతున్నాడన్నారు. రూ.కోట్లు వెచ్చించి ప్రతి గ్రామంలో మట్టిరోడ్డు లేకుండా చేశానని, మురుగునీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయించినట్లు కాకాణి చెప్పారు. పేదలకు భూముల పంపిణీ, చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపానన్నారు. మూడో పర్యాయం అవకాశం ఇవ్వాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎవరి హయాంలో అందాయో గుర్తించి ఓటేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మంత్రి వెంట చిల్లకూరు వెంకురెడ్డి, పి.బాబిరెడ్డి, బూసుపల్లి చిన్నపరెడ్డి, కె.రామిరెడ్డి, శ్రీహరి, చంద్రశేఖర్, వై.పెంచలరెడ్డి, టి.నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.



పార్టీ చేరిన వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

## టీడీపీ, జనసేన నుంచి 150 మంది చేరిక

**నెల్లూరు సిటీ:** రూరల్ నియోజకవర్గంలోని 17వ డివిజన్‌లో జనసేన, టీడీపీకి చెందిన 150 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ఆ పార్టీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. పంట్రంగి తేజ, బాలయ్య, సీహెచ్ గోపాల్, ఊటుకూరు అఖిల్, బాలు, హరికృష్ణ తదితరులకు ఆదాల కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్, నాయకులు పాముల రమణయ్య, కతారి గోపీనాథ్ పాశం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్లపై కక్ష కట్టిన చంద్రబాబు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** 'చంద్రబాబు నాయుడు వలంటీర్లపై కక్ష కట్టాడు. వారు సంక్షేమ పథకాలు, వృద్ధులు, దివ్యాంగుల పింఛన్లు ఇవ్వకుండా తన మనుషుల ద్వారా ఈసీకి ఫిర్యాదు చేయించి అడ్డుకున్నాడు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 200 మంది వలంటీర్లు బుధవారం తమ పోస్టులకు రాజీనామా చేశారు. అనంతరం నెల్లూరులోని ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజల మనిషి అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆయన విజయం కోసం తమవంతు కృషి చేస్తామని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయడమే తమ లక్ష్యమన్నారు. ప్రజా సేవ చేసే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, సచివాలయాల కన్వీనర్ మోర్ల మురళి, నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీకి ఓట్లేస్తే చీకటి రోజులు తప్పవు

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యే రామిరెడ్డిని సత్కరిస్తున్న ముస్లింలు

**కావలి:** 'తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేస్తే చీకటి రోజులు తప్పవు. ప్రజలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వెంగళరావునగర్‌లో బుధవారం జరిగిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ స్థాపించిన నాటి నుంచి ముస్లింలు అండగా ఉన్నారన్నారు. 2019లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారన్నారు. ఈ ఎన్నికల్లోనూ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ముస్లిం, మైనారిటీలకు వైఎస్ రాజశేఖరరెడ్డి అండగా నిలిచారన్నారు. ఆయన రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో అనేక మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. కర్నూలు వంటి కీలక స్థానాల్లో ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారన్నారు. అదే విధంగా కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లోనూ ముస్లింలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాలు, హజ్ యాత్రకు ఆర్థిక సాయం అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో ముస్లింలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. చంద్రబాబు మతతత్వ పార్టీ అయిన బీజేపీతో చేతులు కలిపి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో షేక్ నాయబ్ రసూల్, మొగల్ సలీం బేగ్, మొగల్ రహీం బేగ్, పఠాన్ నవాజ్ ఖాన్, షేక్ ఫీర్ మహమ్మద్, నాయబ్ రసూల్, షేక్ అబ్దుల్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# మీ కోసం.. మా వంతుగా..



బుచ్చిరెడ్డిపాళెం ఏడో వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న గీతారెడ్డి



ఉదయగిరి యాదవవీధిలో పూరీలు వేస్తున్న నిహారిక

ప్రచార పర్వం

ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థులకు మద్దతుగా వారి కుటుంబసభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి మద్దతుగా ఆయన కోడలు నిహారిక బుధవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని ఏడో వార్డులో కోవూరు అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి నల్లపరెడ్డి గీతారెడ్డి, కోడలు పూజారెడ్డి ప్రచారం చేశారు. కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరుతూ ఆయన కుమారుడు రామిరెడ్డి బాలసాకేత్‌రెడ్డి – మహిమ దంపతులు, కుమార్తె సంహిత – అఖిలేష్‌రెడ్డి దంపతులు 35వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యేగా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ ఆయన కుమార్తె పూజిత ముత్తుకూరు పట్టణం బీసీ కాలనీ, ఎమ్మార్వో గిరిజన కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని కోరారు.

– ఉదయగిరి/బుచ్చిరెడ్డిపాళెం రూరల్/కావలి/ముత్తుకూరు



కావలిలో రామిరెడ్డి కుటుంబసభ్యుల ప్రచారం



ముత్తుకూరులో ఓటు వేయాలని కోరుతున్న పూజిత